# మాళవిక

రామినేని ఫణి

ఆమె అద్దం ముందు నిలబడి ఉంది. నిడుపాటి కుంతలాల మెరుపులో, అర్ధ నిమీలిత నేత్రాల సోయగంలో, నిడుపాటి నాసిక దిగంతాలనే ధిక్కరిస్తున్నట్లుగా అలవోకగా అధరాలు అందాలు చిందిస్తున్న మధురిమలో పసిడి మెరుగుల జిలుగుల్ని సైతం వెక్కిరించే మేని మెరుపును తన నీలాల నయనాలతో ఒక్కసారి ప్రతిబింబాన్ని వీక్షించింది మాళవిక.

సన్నని నడుము!

పురుష హృదయాల్ని పట్టి బంధించే సౌందర్యం!

వీణ తీగెలకు సంగీతాన్ని నేర్పగల వేలి కొనలతో కాటుక కురులను ఒక పక్కకు ఒత్తిగించి, అద్దంలో తన సౌందర్యాన్ని చూసుకుని సుకుమారంగా నవ్వింది.

మాళవిక సౌందర్యం మాళవికకే మోహం పుట్టించింది. ఇక పురుషులా? శలభాల్లా మాడి పోవలసిందే!

మగధలో లక్ష్మీపుత్రులు, నగటిమిగల శౌర్యధనులు, సౌందర్యం కోసమై విశ్వాన్ని మధించే రసికులు ఒకరనేమిటి మగధలో గల రాజన్యులు సైతం మాళవిక అంటే మదన ప్రకోపంతో జ్వలించిపోతారు.

మాళవిక! బ్రహ్మ సృష్టిలో నుంచి అనేక వరాల్ని పొంది జన్మించిందే! మాళవిక అద్భుత నర్తకి. రాజుకూ, ప్రజకూ! రసికులకు శృంగార రసాధిదేవత!

కానీ మాళవిక అంతరాంతరాలలో ఒక మృగతృష్ణ. ఒక అశాంతి! అదేమిటి? అంతులేని అందాలు అనుభవించినా, శృంగార రసాలలో ఓలలాడినా అవధి లేని మధురిమలో మూర్ఛిల్లినా ఆమె అంతఃకరణం ఒక శూన్య గృహం!

మూసిన హృదయ గవాక్షాలను తెరిచి, తన శూన్య హృదయ పేటికను ఆనంద సందోహంతో నింపే మగవాడి కోసం ఆమె ఆరాటం.

ప్రతి శరీరంలో ఏదో ఒక లోపం! ప్రతి మానవ మనస్తత్వంలో ఒక అసంపూర్తి! పరిపూర్ణ పురుషుని సాంగత్యంలో తన హృదయం ప్రశాంత గౌతమిలా పరిఢవిల్లాలని ప్రగాఢ వాంఛ ఆమెకు.

ఆమె తన సౌందర్య రసాస్వాదన చేసే సమయంలో బాలభానుడు నడిమింటి ఆకాశాన్ని చేరటానికి తొందర పడుతున్నాడు. అప్పుడు ఆమె కర్ణాలకు ఒక మధుర మంజుల స్వరం లీలగా సోకింది.

"బుద్ధం శరణం గచ్ఛామి!
ధర్మం శరణం గచ్ఛామి!
సంఘం శరణం గచ్ఛామి!"

"ఓహో! ఏమి ఆ మధురత్వం! ఏమి ఆ కంఠ ధ్వని!"

మాళవిక కురులను సవరించుకుంటూ పైడి గవాక్షం వద్దకు వచ్చి పట్టు తెరను ఒత్తిగించి చూసింది.

చేత భిక్షా పాత్రతో ఒక నవ యవ్వనుడైన బౌద్ధ భిక్షువు త్రిపిటకాన్ని ఉచ్చరిస్తూ సాగిపోతున్నాడు. అతని అద్భుతమైన నేత్రాలలో ఒక అలౌకికమైన నిశ్చలత! శరీరం గమిస్తున్నదే కానీ, ఆ యువకుడు అవ్యక్తాన్నేదో చూస్తున్నట్టు సాగిపోతున్నాడు.

మాళవిక నయనాలు, పంచేంద్రియాలు ఒక క్షణం చకచ్చకితం అయిపోయాయి. సంగీతానికే రాగాలు నేర్పగల ఆ గళమాధుర్యం సమస్త లోకాల్ని తృణీకరించి నడిచే ఆ గాంభీర్యం, మేరువును సైతం గడ్డి పరకలా చూసే ఆ నిశ్చలత మాళవిక మానస సరోవరంలో ఒక అలౌకికమైన ఆకర్షణను కలుగ చేసింది.

ఇంతవరకు నిశ్చలంగా ఉన్న ఆ తటాకం ఇప్పుడు అలలతో క్షోభిల్లింది. తెరవని గుండె తలుపులు తెరుచుకుంటున్నాయి. ఆమె మాట్లాడలేదు. నవ్వలేదు! అలవోకగా చూడలేదు. ఆమె ప్రాణ్పడి పోయింది.

భిక్షువు వీధి చివరకు వెళ్ళిపోయాడు.

మరో క్షణ మంటే మరో వీధిలో ప్రవేశించే వాడే! కానీ మాళవిక సమస్త శక్తుల్ని కేంద్రీకరించుకుని పిలిచింది.

"ఓ. భిక్షూ!"

భిక్షువు ఆగాడు.

"ఓయీ నిన్నే!" మళ్ళీ పిలిచింది. ఆర్ద్రత, ఆత్రత కంగారు మిళితమైన స్వరంతో.

భిక్షువు వెనక్కి తిరిగాడు.

మాళవిక ఒక పళ్ళెంలో ముత్యాలు రాసిగా పోసి గవాక్షం తెరిచింది. భిక్షువు బాలార్కుడిలా గుమ్మంలోకి ప్రవేశించాడు. గుమ్మంలోనే ఆగి పోయనాడు.

."స్వాగతం! సుస్వాగతం!" పళ్ళెన్ని ఒక చేతో ధరించి, మరో చేతో లోనికి రమ్మని సూచిస్తూ అన్నది మాళవిక.

"బుద్ధం శరణం గచ్ఛామి."

నిర్నిమేషంగా బౌద్ధ భిక్షువు ఆమె వంక చూశాడు.

నిడుపాటి ఫాలభాగం, నిండైన కనులు, ఆ కన్నుల్లో ఒక దివ్య భావన. సమస్త విశ్వాన్ని సైతం మంత్రబద్ధం చేసే మెరుపు.

"అభ్యంతరాల్ని దాటి రావేం.., భిక్షూ!"

మౌనంగా, భావాతీతంగా నిలబడి ఉన్నాడు భిక్షువు.

"భిక్ష కావాలా?"

మౌనమే సమాధానం.

"నా సమస్త ఐశ్వర్యాలతో నన్ను నేను నీకు భిక్షగా ఇచ్చుకుంటున్నాను." అంటూ ఉండగా, సన్నని దరహాసం ఆ ముఖ మండలంలో మెరిసింది.

మౌనానికీ, మాటలకుమధ్య నలిగని అంతరంగంతో వెనక్కి తిరిగాడు భిక్షువు.

"ఆగవోయీ!" వీణలు మీటవలసిన చేయి ఒక పిధి భిక్షువు హస్తాన్ని మృదువుగా పట్టుకుంది.

భిక్షువు ఆమె కళ్ళలోకి చూశాడు. ఆ క్షణంలో ఆమె అంతరంగం ఒక అలౌకికమైన ప్రశాంతతకు లోనైంది. ఎన్నడూ దొరకని శాంతి, ఆనందం ఆమె హృదయంలో ఒక్క క్షణం మెరిసింది.

"తృణ ధాన్యం భిక్ష మడిగాను కానీ బంగారు రాసుల్ని కాదు."

"తనంత తాను భిక్షకై ఒదిగిన ఐశ్వర్యాన్ని అతివను కాదంటావా "

"అడవులలో, విహారాలలో, ఆరామాలలో తథాగతుని స్మరించుకుంటూ బతికే జీవులకు ఐశ్వర్యం ఎందుకు?"

ఏ భావం తొణకని పొడి మాటలు సంగీత ఝరిలా సాగాయి.

ఆమె కళ్ళలో పట్టుదల 'నా సౌందర్యాని కీతడు జ్వలించడేమిటి? సౌందర్యంతో సాధించలేనిది ఏదీ లేదే!"

"తరుణులను బంధించాల్సిన నీ కరాలతో భిక్షా పాత్రను ఎందుకు పట్టావు, భిక్షూ?"

మౌనమే సమాధానం.

"లోకంలోని అందాల్నీ, సౌందర్యాలనూ తనివి తీరా గ్రోలవలసిన యవ్వనంలో విరక్తి కాంక్షల్ని ఎందుకు నింపుకున్నావు, భిక్షూ?"

భిక్షువు పలికాడు.

"అజ్ఞాన హృదయాలకు జ్ఞానోపదేశం చేయాల్సిన భిక్షువు అదును చూసి పారిపోయే భీరువా!"

లభిక్షేమిస్తూ అన్నది.

ఈ సారి భిక్షువు ఆగాడు.

"నీకు నిజంగా జ్ఞానమే కావలసి వస్తే, నన్ను నిజంగా ప్రశ్నించవు." భిక్షువు సమాధానమిచ్చాడు.

"ప్రశ్నించటం తప్పు కాదుగా!"

"కాదు.

"కోరికల్ని చంపుకోమని, సౌందర్య రాహిత్యంలో బతకమని, జీవితాన్ని నరకం చేసుకొమ్మని తథాగతులే చెప్పివెళ్ళారా, భిక్షూ!

"ఆత్మ సౌందర్యం అర్థమైతే మరి కోరికే లేదు, యువతీ!

"సౌందర్యంతో ఓలలాడుతున్న నీవు నీ ఇరవై ఏళ్ళ వసంతాల్ని శుష్క వేదాంతపు ఛాయల్లోకి జారిపోనిస్తూ వ్యర్థం చేసుకుంటున్నావు, భిక్షూ. రా! నాతో జీవితాన్ని పంచుకో! ఈ సౌందర్యం ఈ జీవితం సాఫల్యం పొందుతాయి!" ఆవేశంగా అన్నది వైశాలిని.

భిక్షువు చిరునవ్వు నవ్వాడు.

"సౌందర్యపు లోతులు చవి చూశాను కనుకనే శుష్క సౌందర్యాన్ని వదిలి వేశాను."

"భిక్షూ! మరణం తరవాత మహత్తరమైన





ఫోటో-
ఎస్.ఆర్.గ్రోవర్

లోకం దాటిపోతుందో లేదో నాకు తెలియదు. కానీ స్వర్గం నా కౌగిలిలో ఉంది. శృంగార రసాస్వాదనలో అలసి సొలసిన మేను స్వర్గానుభూతిని పొందుతుంది. శృంగార రస తాదాత్మ్యతలో జీవితం సౌందర్యంతో, మూర్ఛిల్లుతుంది, భిక్షూ! అటువంటి స్వర్గం ఈ క్షణాన నీ కోసం సిద్ధంగా ఉంది."

భిక్షు మాట్లాడలేదు. మౌనంగా వెనక్కి తిరిగాడు. మాళవిక కన్నులు అశ్రుపూరితా లయ్యాయి.

"ఎండలో, కటిక రాత్రులో, అరణ్యాలలో ఏదో తెలియని దాని కోసం అన్వేషించే కన్నా, నీ జీవితం అనురాగ భరితం చేసుకోకూడదా! నేనందుకు సిద్ధంగా ఉన్నాను. ఈ సకల సంపదలతో నేను నీకు ధారాదత్తం అయిపోతాను. నీ భిక్షా పాత్రలోకి ప్రేమతో ఒదిగి పోతాను, భిక్షూ! ఏమంటావ్?" సౌందర్యం, లాలస శారీరకతృష్ణ, ఆవేశం మిళితమైన ఆ మగధ రాజ్య తిలోత్తమ పలుకులు శిలలు తాకిన కెరటాల వలె విరిగి పోయాయి. నిర్నిమేషంగా మాళవిక వంక చూసి అతడు వెనక్కి తిరిగాడు.

"భిక్ష స్వీకరించవా?"

"సమయం వచ్చినప్పుడు నా అంతట నేనే వచ్చి భిక్ష స్వీకరిస్తాను." అతని అడుగులు వడిగా సాగినాయి. బాలభానుని లేత కిరణాలు అతని మిసిమి దేహంపై పడి తళుక్కుమన్నాయి. మాళవిక కంటి కొసన ఒక అశ్రుతర్పణం నిర్లిప్తంగా నిలిచి పోయింది.

● ● ● ●

"వూరక రారు మహానుభావులు! ఈ మాళవిక కోసం మహామాత్యుల వారే విజయం చేశారంటే ఏదో విశేషం తప్పక ఉండే ఉంటుంది. తాంబూల చర్వణంతో ఎర్రబారిన అధరాన్ని ముత్యం వంటి పంటితో నొక్కుతూ అన్నది మాళవిక.

"మంత్రాంగమేదైనా ఉన్నప్పుడే ఈ శూర సేనుడు ఈ చిరుబోడి సంపారం కోసం వస్తాడు కదా!" పట్టు బాలీసుపై కూర్చున్న మగధ రాజ్య మహామాత్యులు సమాధాన మిచ్చాడు.

"ఏమిటో అది?" వల్లెవాటును అలవోకగా జార విడుస్తూ, బంగారు మధుపాత్రను అతని కందించింది. ఆ మధుపాత్రను తీసుకుంటూ ఆమె మృదుహస్తాన్ని పట్టుకుని లాగాడు. గలగల నవ్వుతూ చెంగున అతని ఒళ్ళో వాలిపోయింది మాళవిక.

"జాణవు సుమీ!" మునిపంటితో, అర్ధ నిమీలిత నేత్రాలతో ఆమె వంక చూస్తూ అన్నాడు.

సుగంధం, స్త్రీ తనూ సౌకుమార్యం, మధువు లోని మాదకత్వం అతని కన్నుల్లో ఏదో విచిత్రమైన ఆనందపు మెరుపును కలిగిస్తున్నాయి.

"మాళవికా!" అతని కంఠం విచిత్రంగా ధ్వనిం చింది.

"ఊఁ." అతని ఒడిలో మత్తుగా పలికింది.

'సమరగుప్తులవారు ప్రతిరోజూ వేంచే స్తున్నారా?" అతని కంఠంలోని చురుకుదనానికి ఈ లోకంలోకి వచ్చింది మాళవిక.

"పోయిన పూర్ణిమ నాడు వచ్చారు. వారానికి రెండుసార్లే వారి దర్శనం" అన్నది మాళవిక.

"సమరగుప్తులు నేడే కళింగ నుండి మగధకు వేంచేశారు. రేపు సాయంకాలం నీ విడిదికి దయ చేస్తారనుకుంటాను."

మాళవిక మౌనంగా ఉంది. 'మంత్రి మంత్రాంగ మేదై ఉంటుందా?' అని ఆమె ఆలోచిస్తోంది.

"నీ ఇంటికి వచ్చిన సమరగుప్తుడు మళ్ళీ అంతః పురానికి వెళ్ళడు." విచిత్రమైన నవ్వు శూరసేనుడి పెదవులమీద మెరుస్తోంది.

"అంటే?" అనుమానంగా ప్రశ్నించింది మాళవిక.

శూరసేనుడి బాహువులు మాళవికను బంధిం చాయి. ఆమె చెవిలో ఏదో రహస్యం చెప్పాడు. చెప్పి ఆమెను బలంగా హృదయానికి హత్తుకున్నాడు.

రాత్రి రెండవ ఝాము గడుస్తోంది.

శూరసేనుడు హఠాత్తుగా లేచాడు. అతన్ని లతలా పెనవేసుకున్న మాళవిక కదిలింది. అతని విశాల వక్షఃస్థలంపై శ్వేతనాగులా ఉన్న ఆమె హస్తాల్ని ప్రక్కకు తొలగించి లేచాడు.

"మరిచిపోకు." నర్మగర్భితంగా అని బయటికి వెళ్ళిపోయాడు. ఆ వీధిలో గుర్రపు డెక్కల శబ్దం లీలగా వినిపించింది.

అర్ధరాత్రి కీచురాళ్ళ సవ్వడి వింతగా ప్రతిధ్వని స్తోంది. మాళవిక రథాన్ని స్వారీ చేసుకుంటూ అరణ్యంలో పోతోంది. అపస్మారక స్థితిలో యువరాజ సమరగుప్తుడు మాళవిక రథంలో పడి ఉన్నాడు. శూరసేనుడు రథాన్ని అనుసరిస్తున్నాడు. అరణ్యం చివర ఉన్న శిథిలాలయం వద్దకు వెళ్ళి రథం ఆగింది. చుట్టూ చీకటి. ఆకాశంలో నక్షత్రాల వెలుగు. శిథిలాలయం భయంకరంగా కన్పిస్తోంది.

శూరసేనుడు గుర్రం దిగి వచ్చాడు. ఇద్దరూ కలిసి యువరాజు శరీరాన్ని రథంలోనుంచి బయటికి తీశారు.

"ఏం చేద్దాం?"

"ఆలయం వెనుక కందకం ఉంది. దాన్లో పడవేద్దాం."

యువరాజు శరీరాన్ని ఇద్దరూ కలిసి ఆలయం వెనక్కి మోసుకు వెళ్ళారు. ఆలయం వెనుక విష కీటకాలతో, విష సర్పాలతో నిండి ఉన్న ఓ దిగుడు బావి ఉంది. దానిలో జలం ఎప్పుడూ పసిరిక రంగులో ఉంటుంది. యువరాజు శరీరాన్ని అందులోకి విసిరేశారు. మాళవిక భయం భయంగా వచ్చి రథం ఎక్కింది. అశ్వికుడు, రథం వెనక్కి తిరిగాయి. అశ్వికుడు రథం దగ్గరకు వచ్చాడు.

"త్వరలో మహారాజు కూడా మరణిస్తాడు మనో వ్యథతో. అప్పుడు రాణివి నీవే, మాళవికా!"

మాళవిక కన్నులు ఎర్రగా మెరిశాయి. ఆకాశంలో చంద్రుడు, చుక్కలు ఒక్కసారి ఫక్కున నవ్వాయి. అంతరంగం ఒక పైశాచిక హస్తంతో నలపబడు తున్నట్లు మాళవిక భయానికి లోనైంది.

రథం సాగిపోతోంది. మాళవిక అంతరంగంలో ఓ స్వరం అపహసిస్తున్నట్లు అన్పించింది.

"బుద్ధం శరణం గచ్ఛామి!"

ధర్మం శరణం గచ్ఛామి!"

సంఘం శరణం గచ్ఛామి!"

మాళవిక చేతిలో కళ్ళేలు జారిపోయాయి. ఆమె కన్నులు అశ్రుపూరితా లయ్యాయి. శూరసేనుడు




వెనక్కి తిరిగి చూశాడు.

"మాళవికా!"

మాళవిక ఈ లోకంలోకి వచ్చింది. కళ్ళేలు పుచ్చుకుంది. గుర్రపు డెక్కల శబ్దం. రథం సాగిపోతోంది.

ఇంతలో హఠాత్తుగా కొమ్మల్లోనుంచి ముసుగు మనుషులు క్రిందకు దూకారు. రథం ఆగింది. శూరసేనుణ్ణి, రథాన్ని చుట్టుముట్టారు. మాళవిక భయంతో కెవ్వున అరచి మూర్ఛపోయింది.

• • • •

శ్మశాన స్థలం. నిండు పూర్ణిమ. వెన్నెల శవాల మీద, సమాధుల మీద ప్రసరిస్తోంది. చమువ్వని వెంపుడే వెలుగులా చీకటిని చీల్చటానికి వెన్నెల ప్రయత్నిస్తోంది.

ఆ నిశీధిలో ఓ అస్తవ్యస్తమైన దిబ్బ ప్రక్కన కాళ్ళూ చేతులూ ఖండించిన మానవ శరీరం పడి ఉంది. అది స్త్రీది.

ఒకప్పుడు తన సౌందర్యాగ్నిలో ఎందరో రసికుల్ని మలమల మాడ్చిన మాళవిక తనువు! శృంగార రసాంబుధి అంతు చూడమని బ్రహ్మ వరంగా ప్రసాదించిన అమూల్య దేహం. ఈ నాడు అందవిహీనమై, అంగవిహీనమై పదుగురు మలినాన్ని పారవేసే పెంట దిబ్బపై దయనీయంగా, వికృతంగా, రక్తధారా పరివేష్టితమై పడి ఉంది.

"అబ్బా!" ఒళ్ళంతా రక్తపు పుండై, అనుక్షణం భరించలేని చిత్రవధతో నలిగిన మనస్సుతో అంది మాళవిక.

ఆమె కళ్ళలోనుంచి రక్తపు కన్నీళ్ళు ధారగా కారిపోతున్నాయి.

యువరాజును కుట్రచేసి చంపి, మగధ రాజ్యలక్ష్మిని చేపట్టాలనే శూరసేనుడి పథకం చివరి నిముషంలో రాజుకు తెలిసింది.

శూరసేనుడికి మరణశిక్ష! మాళవికకు అంగవిచ్ఛేదం! అందాన్నీ, దాని మాటున కాఠిన్యాన్నీ గుర్తించిన రాజు మాళవికకు వేసిన భయంకర శిక్ష!

తన తనువుతో రసికులనూ, రాజులనూ రంజింప చేసింది!

తన తనువు పొందుకోసం అనేక మంది భ్రమించారు. అటువంటి తన తనువును ఈ నాడు ప్రజలు విష కీటకంగా భావించి పెంట దిబ్బలోకి విసిరివేశారు.

'ఈ రాత్రి ఈ విష కీటకాల మధ్య నా తనువు శిథిలం కావలసిందేనా! భగవాన్! నా కేది రక్ష! నన్ను చంపేయ్! నన్ను త్వరగా చంపేయ్! ! ఈ చిత్రవధ భరించలేను.' మాళవిక ఆక్రోశించింది.

"బుద్ధం శరణం గచ్ఛామి!
ధర్మం శరణం గచ్ఛామి!
సంఘం శరణం గచ్ఛామి!"

గంభీరంగా, నిండుగా పారే సెలయేరులా ఉంది ఆ కంఠం.

మాళవిక ఓ క్షణం ఆ స్వరం వచ్చిన దిక్కువంక చూసింది. ఉపగుప్తుడు త్రిపిటకాన్ని ఉచ్ఛరిస్తూ వస్తున్నాడు. వెన్నెల అతన్ని తెల్లగా వెలిగిస్తోంది. ఉపగుప్తుడు మాళవిక శరీరం దగ్గరకు వచ్చి ఆగాడు.

మాళవిక అశ్రుపూరిత నయనాలతో ఆ భిక్షువును చూసింది.

"భిక్షూ!" ఆమె పెదవులు కదిలాయి.

"తరుణీ! భిక్ష స్వీకరించటానికి వచ్చాను." ఆ మాటలు మాళవిక హృదయం మీద కొరడా దెబ్బల్లా తగిలాయి.

"భిక్షూ!"

"తరుణీ! సమయం వచ్చింది."

కన్నీటి తెరలో కమనీయంగా కన్పిస్తున్న కరుణామూర్తి వంక చూసింది.

"నీకు భిక్ష ఇవ్వటానికి నా దగ్గరేం ఉంది, భిక్షూ! నన్నపహసిస్తున్నావా?" గద్గదంగా అన్నది.

"నా కివ్వటానికి నీ దగ్గర అమూల్య ధనం ఉంది, తరుణీ!"

"నీకోసం దాచిన సౌందర్యం నేడు వికృతమైపోయింది. నీకు నే నెందుకూ పనికిరాను, భిక్షూ! వెళ్ళు! వెళ్ళిపో!" ఆవేదనగా ఆమె కంఠం పలికింది.

"నీలో అద్భుత సౌందర్యం ఉంది. అది భిక్షగా ఇవ్వు." అంత చిత్రవధలోనూ ఆమె పెదవులమీద సన్నని నవ్వొకటి ఉదయించింది.

"నా దగ్గరా! శ్మశానంలో విసిరివేసినా, నాలో నీకు అద్భుత సౌందర్యం కనిపిస్తోందా?" అన్నది.

"నువ్వే! నీ హృదయమే! పశ్చాత్తాప జ్వాలతో పునీతమైన నీ హృదయమే నాకు భిక్షగా కావాలి. ఈ శరీరం నశించి పోయేదేనని నీ కర్థమై ఉంటుంది. కానీ అద్భుత సౌందర్యంతో వెలిగే నీ హృదయంలో మాత్రం ఎప్పుడూ సౌందర్యం జ్వలిస్తూనే ఉంటుంది. తథాగతుడి దివ్య చరణాలలో నీ బతుకు అంకితం చేసే దివ్య తరుణం ఇదే, తరుణీ! రా! నాతో ... రా! మృత్యువెరుగని మహితాత్మమైన లోకానికి రా! ..."

ఆమె శరీరాన్ని చేతులతో పైకెత్తాడు. దూరంగా కనిపించే కుటీరం వైపు సాగిపోయాడు. అప్రయత్నంగా మాళవిక కంఠంలో త్రిపిటకం పలికింది.

"బుద్ధం శరణం గచ్ఛామి!
ధర్మం శరణం గచ్ఛామి!
సంఘం శరణం గచ్ఛామి!"

ఆకాశంలో ఓ నక్షత్రం దివ్యమైన కాంతితో నేల రాలింది.

తథాగతుడి దరహాసంలా వెన్నెల పులకించింది. ✱